క్లుప్తంగా

ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

బేస్తవారిపేట: విద్యాహక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా సీటు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి తెలిపారు. ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 25 సీట్లను పేదలకు ఉచితంగా ఇచ్చేందుకు అవకాశం కల్పించారని, ఈనెల 2 నుంచి 19వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథ పిల్లలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీల్లోని అల్పాదాయ వర్గాలవారు అర్హులన్నారు.

7న వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఈ నెల 7వ తేదీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో లలితా సహస్రనామ పారాయణం, ఉత్సవ మూర్తికి పంచామృత అభిషేకం, ఆర్యవైశ్య మహిళల చేత సామూహిక కుంకుమార్చన పూజ, మహా మంగళహారతి, మూలవిరాట్ మూర్తి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాల్సిందిగా కోరారు.

అదుపుతప్పి కారు బోల్తా



కొమరోలు: ప్రమాదానికి గురైన కారు

కొమరోలు: మండలంలోని బాలిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటన శనివారం చోటు చేసుకోగా కారులో ఉన్న ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారు బెలూన్లు తెరచుకోవడంతో క్షతగాత్రులకు ప్రాణాపాయం తప్పింది. కారు ప్రమాదంలో నుజ్జునుజ్జు అయింది.

కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలు



కొమరోలు : సంఘటన స్థలంలో పడి ఉన్న ద్విచక్ర వాహనం

కొమరోలు: కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గోనపల్లె, మదవపల్లె గ్రామాల మధ్యలో శనివారం చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనాన్ని కారు వేగంగా ఎదురుగా ఢీకొనడంతో కోనపల్లె గ్రామానికి చెందిన చెన్నయ్య, వెంకట సుబ్బయ్యకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో గిద్దలూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఎస్సై సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు ఆగకుండా వేగంగా వెళ్లిపోయింది.

ప్రమాదకర ప్రయాణాలు వద్దు



డ్రైవర్‌కు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై రాజమోహన్

మార్కాపురం: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణాలు చేస్తే ప్రమాదాలు సంభవిస్తాయని స్థానిక టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్ హెచ్చరించారు. శనివారం పట్టణ శివారులో ట్రాక్టర్లు, ఆటోలు, వివిధ వాహనాల్లో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వారిని ఆపి డ్రైవర్లు, ప్రయాణికులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణించకూడదని, అలా చేస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తానని హెచ్చరించారు. ఓవర్ లోడ్‌తో వాహనాల్లో ప్రయాణిస్తే ప్రమాదవశాత్తూ ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువ ప్రాణనష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

5 నుంచి భక్తాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

మార్కాపురం టౌన్: మండలంలోని ఎల్‌బీఎస్ నగర్‌లో వెలసిన భక్తాంజనేయస్వామి 36వ వార్షికోత్సవాన్ని ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.రామకృష్ణారెడ్డి, వాగిచర్ల సుబ్బారావు శనివారం తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అఖండ జ్యోతి ప్రజ్వలన, స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్న సంతర్పణ, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వార్షికోత్సవాల్లో ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, పాటకచేరీ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

గ్రంథాలయాలు సృజనాత్మకతకు వేదికలు



గ్రంథాలయంలో ఇంగ్లిషు గ్రామర్ నేర్పుతున్న ఉపాధ్యాయుడు

- విజ్ఞాన సముపార్జనలో బాలబాలికలు
- చదువుతోపాటు పలు నైపుణ్యాల్లో శిక్షణ
- గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు

బేస్తవారిపేట:

వేసవి సెలవుల్లో చిన్నారులకు పుస్తక పఠనం, విజ్ఞానం పెంపొందించేందుకు గ్రంథాలయాలు వేదికలవుతున్నాయి. గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని అన్ని శాఖల్లో ఏప్రిల్ 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు 40 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందించారు. 10 నుంచి 15 ఏళ్లలోపు బాలబాలికలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. నిత్యం పాఠ్యపుస్తకాలతో కుస్తీ పడుతూ ఏడాదంతా కష్టపడిన విద్యార్థులకు పరీక్షల అనంతరం వేసవి విరామం లభించడంతో ఆనందానికి అవధులుండవు. సెలవుల్లో చిన్నారులకు విజ్ఞానదాయకమైన అంశాలను నేర్పించేందుకు గ్రంథాలయాల్లో ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఆటలు, పాటలు, కథలు వినడం, చదవడం వంటి విభిన్న అంశాలపై ఆయా గ్రంథాలయాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆయా అంశాల్లో అనుభవజ్ఞులైన రిసోర్స్ పర్సన్‌లతో పిల్లలకు తర్ఫీదును అందిస్తారు.

ప్రధానంగా మూడు ఉద్దేశాలు:

ఈ శిబిరాల ద్వారా ప్రధానంగా మూడు ఉద్దేశాలను ఎంచుకున్నారు. బాలలు వేసవి సెలవుల్లో లభించే విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. చదవడాన్ని వారు ఒక మంచి అలవాటుగా పెంచుకోవాలి. క్రమం తప్పక గ్రంథాలయాలకు వచ్చే విధంగా వారిలో ఆసక్తి కలిగించాలి. బాలల సాహిత్యానికి చెందిన పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం.

ప్రత్యేక తరగతుల సమయం ఇలా..

- ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు కథలు చదివి వినిపించడం (వినగలిగే సామర్థ్యాన్ని పెంచడం)
- గం.8.30 నుంచి 10 గంటల వరకు పుస్తక పఠనం
- గం.10.10 నుంచి 10.30 గంటల వరకు పుస్తక సమీక్ష
- గం.10.30 నుంచి 11 గంటల వరకు కథలు చెప్పడం
- గం.11 నుంచి 12 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిషు, డ్రాయింగ్, పెయింటింగ్, మ్యూజిక్, డ్యాన్స్, డ్రామా, చెస్, క్యారమ్స్, క్విజ్, జీకే, ఇతర నైపుణ్య శిక్షణలు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. చదువుతోపాటు ఇతర నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. బాల్యం నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి.

– పీవీ సుబ్బారెడ్డి, గ్రంథపాలకుడు, బేస్తవారిపేట

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి

గిద్దలూరు రూరల్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ అన్నారు. మే డే వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని నగరపంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాల పై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి బాధ్యతగా ప్రవర్తించాలన్నారు. ఏదైనా క్రిమినల్ కేసులల్లో అరెస్ట్ అయిన వారిని 24 గంటల్లో న్యాయమూర్తి ఎదుట హాజరుపరచాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజర్ రంగారావు, ఏఈ పోర్షియా, న్యాయవాదులు పిచ్చయ్య, బాలకృష్ణ, పారా లీగల్ వాలంటరి మదు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా మెలగాలి



కొమరోలు : విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

- ఎంఈఓ వెంకటేశ్వర్లు

కొమరోలు: ఉత్తమ మార్కులు సాధిస్తే సరిపోదని, సమాజంలో ఉత్తమ పౌరులుగా మెలగాలని మండల విద్యాశాఖాధికారి–1 కావడి వెంకటేశ్వర్లు తెలిపారు. కొమరోలులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన 19 మంది విద్యార్థులను శనివారం సత్కరించి సర్టిఫికెట్‌లు అందించారు. 550పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపీపీ అమూల్య, ఎస్సై నాగరాజు, ఎంఈఓ వెంకటేశ్వర్లు సన్మానించారు. అనంతరం ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా చక్కగా చదివి మంచి మార్కులు సాధించాలని, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. మంచి లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని ఆ లక్ష్యాలకు అనుగుణంగా విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ బ్రహ్మయ్య, రిటైర్డ్ డిప్యూటీ ఈఓ అమరేశ్వరరావు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డిజైన్ స్లేట్ కార్మికుల కూలి రేట్లు పెంచాలి



ఓనర్స్ అసోసియేషన్ నాయకులకు నోటీసు ఇస్తున్న కార్మికులు

మార్కాపురం: డిజైన్ స్లేట్ అండ్ ముజాయిక్ వర్కర్ల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ కోరారు. శనివారం స్థానిక ఎస్టేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాజమాన్యం – కార్మికుల మధ్య జరిగిన కూలి రేట్ల అగ్రిమెంటు కాలపరిమితి ముగిసిందన్నారు. నూతన అగ్రిమెంటు చేసుకుని కూలి రేట్లు వెంటనే పెంచాలని కోరారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పోలిస్తే ప్రస్తుతం చెల్లిస్తున్న కూలి రేట్లు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ప్రస్తుతం చెల్లిస్తున్న 297 రూపాయల కూలిని రూ.371కు పెంచాలని, హెల్పర్‌కు 294 నుంచి 367 రూపాయలకు, స్ప్లిటర్‌కు 320 నుంచి 400 రూపాయలకు, క్యాలిబ్రేషన్ కార్మికులకు 150 నుంచి 187 రూపాయలకు పెంచాలని కోరారు. ముజాయిక్ కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న కూలికి అదనంగా 25 శాతం పెంచాలన్నారు. కార్మికులకు ప్రమాదాలు జరిగితే గాయాలు తగ్గేంత వరకు మెడికల్ ఖర్చు, చట్టప్రకారం కూలీలు, కార్మికులకు యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేవారు. డబుల్ డ్యూటీ చేసిన కార్మికులకు ఫుల్ భోజనం ధర ఇవ్వాలని యజమానులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన అగ్రిమెంటుకు సంబంధించిన కూలి రేట్లతో కూడిన నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. 14 రోజుల్లో కూలీల ధరలు పెంచితే సమ్మె చేసేందుకు వెనకాడమని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బాలశేషయ్య, టి.రాములు, వెంకటేశ్వరరెడ్డి, మాబు, యాకోబు, బాబు, స్వామి, రమేష్, లక్ష్మయ్య, మల్లమ్మ, నాగులు, అంజి, బ్రహ్మయ్య, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమలాకర్

గిద్దలూరు రూరల్: రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని డిజిటల్ గ్రీన్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ కమలాకర్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, బేస్తవారిపేట మండలాలకు చెందిన ఆర్‌ఎస్‌కే సిబ్బందికి శనివారం ఈ మిర్చి ప్రాజెక్టు పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మిర్చి డిజిటల్ గ్రీన్ సంస్థ వారు రైతులకు ఫార్మర్ చాట్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు, పంటలకు సంబంధించి ఎరువుల వాడకం, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, పంట యాజమాన్యానికి సంబంధించిన సందేహాలకు సలహాలు, మార్కెట్ ధరలు వంటి వాటిని తెలుసుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారులు విష్ణుప్రియ, శ్వేత, ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, రాజేశ్వరి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీరెడ్డి, హెచ్‌ఈఓ శేషగిరి, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయాన్ని వృథా చేయరాదు



విద్యార్థులకు పుస్తకాల గురించి వివరిస్తున్న గ్రంథపాలకులు

గిద్దలూరు రూరల్: విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా వేసవి సెలవుల్లో గ్రంథాలయాలకు రావాలని గ్రంథపాలకురాలు ఎస్.ప్రసన్నకుమారి అన్నారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా పట్టణంలోని గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పోకెన్ ఇంగ్లిషు, కథలు చదవడం, కథలు రాయడం, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, డ్రాయింగ్, జాతీయ నాయకుల జీవిత విశేషాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, వెంకటేశ్వరరావు, నాగూర్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీమాత జయంతి ఉత్సవాలకు అన్నాకు ఆహ్వానం



అన్నాకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని మెయిన్‌బజారులో వెలసిన శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరీ అమ్మవారి జయంతి సందర్భంగా నిర్వహించనున్న ఉత్సవాలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు ఆలయ కమిటీ సభ్యుడు రమేష్ శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. వాసవీమాత జయంతి మహోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయని తెలిపారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నా రాంబాబును కోరారు.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం



ఉత్సవంలో లక్ష్మీచెన్నకేశవస్వామి

కొనకనమిట్ల: జై చెన్నకేశవా అంటూ మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామికి అత్యంత భక్తిశ్రద్ధలతో కల్యాణం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మంగళ వాయిద్యాలతో స్వామివారికి తలంబ్రాలు పోశారు. కల్యాణ ఉభయదాతలుగా మద్దూరి, చెన్నారెడ్డి, చాగంరెడ్డి, గంగవరపు కుటుంబాలకు చెందిన దంపతులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకటకృష్ణకిరణ్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి కల్యాణాన్ని జరిపించారు. కల్యాణాన్ని గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని తిలకించారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

బాప్టిస్టుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న సంఘ ప్రతినిధులు, పాస్టర్లు

మార్కాపురం టౌన్: బాప్టిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని మార్కాపురం బాప్టిస్టు ఫీల్డు అసోసియేషన్ ప్రెసిడెంట్ జె.దేవానందం అన్నారు. పేదలు, అనాథలను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అసోసియేషన్ వార్షిక కూటములు స్థానిక సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిలో శుక్రవారం ప్రారంభమవగా, శనివారం రెండో రోజుతో ముగిశాయి. 6 మండలాల నుంచి 22 బాప్టిస్టు సంఘాల పాస్టర్లు, సంఘ పెద్దలు, క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవానందం మాట్లాడుతూ క్రైస్తవ మిషనరీ ఆస్తుల పరిరక్షణకు క్రైస్తవులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వైస్ ప్రెసిడెంట్ ఉప్పలపాటి చిన్నకాశయ్య, కరస్పాండెంట్ సెక్రటరీ నార్నెపాటి డానియల్ అబ్రహం, వినుకొండ విల్సన్, వేశపోగు జాషువా, ప్రసాద్, పాస్టర్లు గుర్రం శేఖర్, మున్నంగి జార్జిబాబు, విజయభాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి పూజలు



అలంకరణలో శ్రీవారు

కొనకనమిట్ల: మండలంలోని వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులతో సందడి నెలకొంది. నమో వేంకటేశాయ నమోనమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మీఅలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామివార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామివార్లను వెండి కిరీటాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటరామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అర్థవీడులో కిశోర వికాసం

అర్థవీడు: మే 2 నుంచి జూన్ 15 వరకు కిశోర వికాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమిజాబి తెలిపారు. మండల కేంద్రమైన అర్థవీడులోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 11–18 సంవత్సరాల వయస్సున్న కిశోర బాలికలు కార్యక్రమంలో పాల్గొనగా వారికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది రవణమ్మ, రేష్మ, కిశోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓగా అశోక్‌రెడ్డి



ఏఓ అశోక్‌రెడ్డి

మార్కాపురం: మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓగా అశోక్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏఓగా పని చేసిన రవీంద్రారెడ్డి సీఎస్ పురం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఏఓగా బాధ్యతలు చేపట్టిన అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కార్యాలయంలో తమ వంతు బాధ్యతలు నెరవేర్చడానికి కృషి చేస్తానని అన్నారు.